సాక్షి అనంతపురం

బుధవారం। 1। మార్చి। 2023



చీనీ టన్ను రూ.36 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్‌యార్డులో మంగళవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.36 వేలు పలికాయి.



టమాట కిలో రూ.15

కక్కలపల్లి మండీలో మంగళవారం కిలో టమాట ధర గరిష్టంగా రూ.15, కనిష్టం రూ.5, సరాసరి రూ.8 పలికింది.

గరిష్టం/కనిష్టం
37.2°/12.1°

జిల్లా అంతటా మంగళవారం ఉదయం చలి వాతావరణం నెలకొంది. పగటి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదవగా.. రాత్రి ఉష్ణోగ్రతలు స్వల్పంగా తగ్గాయి.

న్యూస్‌రీల్

బసవేశ్వర వాహనంపై చంద్రమౌళీశ్వరుడు



ఉరవకొండ: ఉరవకొండ గవిమఠం చంద్రమౌళీశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామివారు మంగళవారం బసవేశ్వర వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం మూలవిరాట్‌కు విశేష పూజలు, అభిషేకాలు చేశారు. అనంతరం మహా గణారాధన కార్యక్రమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం చంద్రమౌళీశ్వరస్వామి ఉత్సవ మూర్తిని గవిమఠం పీఠాధిపతులు జగద్గురు చెన్నబసవ రాజేంద్రస్వామి, ఉత్తరాధికారి కరిబసవరాజేంద్రస్వామి, సహాయ కమిషనర్ చిట్టెమ్మ ఆధ్వర్యంలో ఊరేగింపుగా తీసుకొచ్చి బసవేశ్వర వాహనంపై కొలువు తీర్చి ఊరేగించారు. బ్రహ్మోత్సవాల్లో బుధవారం మహా రథోత్సవం నిర్వహించనున్నారు. ఇప్పటికే అన్ని ఏర్పాట్లూ సిద్ధం చేశారు. ఏపీ, తెలంగాణ, కర్ణాటక నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివస్తున్నారు. రథోత్సవానికి పంచాయతీ ఆధ్వర్యంలో బెంగళూరు నుంచి ప్రత్యేక పూలమాలలు తెప్పిస్తున్నారు.

నేడు ఈఎస్‌ఐసీ 'గ్రీవెన్స్'

అనంతపురం సప్తగిరి సర్కిల్: కార్మిక రాజ్య బీమా సంస్థ (ఈఎస్‌ఐసీ) ఆధ్వర్యంలో ఈ నెల 1, 9 తేదీల్లో గ్రీవెన్స్ నిర్వహించనున్నట్లు అనంతపురం బ్రాంచ్ మేనేజర్ కిషోర్‌బాబు తెలిపారు. ఈఎస్‌ఐసీ 72వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఫిబ్రవరి 24 నుంచి మార్చి 10 వరకు పక్షోత్సవాలను నిర్వహిస్తున్నామన్నారు. ఇందులో భాగంగా నగరంలోని తిలక్‌రోడ్డులో గల బ్రాంచ్ కార్యాలయంలో ప్రత్యేక గ్రీవెన్స్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈఎస్‌ఐసీ పరిధిలోని అన్ని యాజమాన్యాలు, ఉద్యోగులు, ఉద్యోగ సంఘాలు, కార్మిక సంఘాలకు పక్షోత్సవాల్లో భాగంగా నిర్వహించే 'సువిధ సమాగమం' కార్యక్రమంలో ఉదయం 11 నుంచి 12 గంటల వరకు గ్రీవెన్స్ ఉంటుందన్నారు. ఈఎస్‌ఐ చందాదారుల సమస్యలను పరిశీలించి.. పరిష్కరించనున్నట్లు చెప్పారు.

రిమాండ్ ఖైదీవద్ద సెల్‌ఫోన్

బుక్కరాయసముద్రం: జిల్లా జైలులో రిమాండ్ ఖైదీ వద్ద సెల్‌ఫోన్ లభించడం కలకలం రేపింది. మంగళవారం ఈ ఘటన వెలుగుచూసింది. బెంగళూరుకు చెందిన రాజ్‌పాల్ సింగ్, రియాజ్, ఆదివాసి, బాషా, జంషద్, ముబారక్ ఇటీవల డ్రగ్స్, నకిలీ కరెన్సీ రవాణా చేస్తుండగా డి.హీరేహాళ్ మండల పరిధిలో పోలీసులు అరెస్ట్ చేశారు. అనంతరం వారిని బుక్కరాయసముద్రం మండలం రెడ్డిపల్లివద్దనున్న జిల్లా జైలుకు రిమాండ్‌కు పంపారు. రాజ్‌పాల్‌సింగ్ వద్ద సెల్‌ఫోన్ ఉన్నట్లు జైలు సిబ్బంది మంగళవారం గుర్తించారు. సెల్‌ఫోన్ ద్వారా బయటి వ్యక్తులతో మాట్లాడి తమ కార్యకలాపాలు సాగిస్తున్నట్లు ప్రాథమికంగా నిర్ధారించారు. జైలు సూపరింటెండెంట్ రహ్మాన్ రిమాండ్ ఖైదీ రాజ్‌పాల్‌సింగ్ నుంచి సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. ఇతనికి సెల్‌ఫోన్ ఎలా వచ్చిందనే విషయంపై దర్యాప్తు చేస్తున్నారు. చట్ట విరుద్ధంగా ప్రవర్తించిన రాజ్‌పాల్‌సింగ్‌తో పాటు ఇదే కేసులో రిమాండ్‌లో ఉన్న రియాజ్, ఆదివాసి, బాషా, జంషద్, ముబారక్‌ను కడప సెంట్రల్ జైలుకు బుధవారం ప్రత్యేక ఎస్కార్ట్‌లో తరలించనున్నట్లు సూపరింటెండెంట్ రహ్మాన్ తెలిపారు.

ఇంటి దొంగల పన్నుపోటు

- అన్‌రిజిస్టర్డ్ హోటల్ పేరిట రూ.2 లక్షలు ఫిక్స్!
- కొన్ని ఆస్పత్రుల నుంచి కూడా భారీగా వసూళ్లు
- సర్కిల్– 1 చుట్టూ అల్లుకుపోయిన అవినీతి అధికారులు
- అడిగినంత ఇవ్వకపోతే భారీగా ఫైన్ వేస్తామని బెదిరింపులు
- జీఎస్టీ అధికారుల ప్రైవేటు వసూళ్లతో ప్రభుత్వాదాయానికి గండి
- తాజాగా హిందూపురంలో ఏసీబీ వలలో ముగ్గురు అధికారులు

ఉమ్మడి అనంతలో జీఎస్టీ సర్కిళ్లు	07
మొత్తం జీఎస్టీ ట్రేడ్ నంబర్లు	30,000
నెలకు అవుతున్న వసూళ్లు	రూ.90 కోట్లు
పూర్తిస్థాయిలో జీఎస్టీ వసూళ్లు జరిగితే	రూ.120 కోట్లు



సాక్షి ప్రతినిధి, అనంతపురం: వాణిజ్య పన్నుల శాఖలో కొంతమంది అధికారుల వల్ల ప్రభుత్వాదాయానికి భారీగా గండిపడుతోంది. ప్రభుత్వానికి రావాల్సిన ఆదాయం కొంతమంది అధికారుల చేతుల్లోకి వెళుతున్నట్టు ఆరోపణలు వస్తున్నాయి. జీఎస్టీ అమల్లోకి వచ్చిన తర్వాత పన్నుల చెల్లింపులు అత్యంత పారదర్శకంగా జరగాలి. అయితే కొంతమంది వాణిజ్య పన్నుల శాఖ అధికారులు దీనికి మోకాలడ్డుతున్నారు. ప్రభుత్వం నుంచి అనుమతి వస్తే గానీ తనిఖీలు చెయ్యకూడదు అన్న ఒక్క సాకుతో కార్యాలయాలకే పరిమితమవుతున్నారు.

మొత్తం జీరో బిజినెస్

ప్రభుత్వానికి పన్నుల రూపేణా రావాల్సిన ఆదాయం అర్బన్‌లో ట్యాక్సులే. అలాంటిది ఇక్కడే 50 శాతం వరకు బిల్లులు లేకుండా అమ్మకాలు జరుగుతున్నాయి. అనంతపురం అర్బన్‌లో కమలానగర్, పాతూరు, ఆర్టీసీ బస్టాండ్ సర్కిల్ వంటి ప్రాంతాల్లో మెజారిటీ వాణిజ్య సముదాయాల్లో బిల్లులు లేకుండా వ్యాపారం జరుగుతోంది. తెల్లవారుజామున లోడ్‌ల కొద్దీ సరుకులు, స్టీల్ సామాన్లు, రకరకాల గృహోపకరణాలు వచ్చిపోతున్నా పట్టించుకునే నాథులే కరువయ్యారు. ఉమ్మడి అనంతపురం జిల్లా వ్యాప్తంగా జీరో బిజినెస్ విచ్చలవిడిగా జరుగుతోంది.

జీఎస్టీ అధికారుల వసూళ్ల తీరే వేరు..

- తాజాగా అనంతపురంలోని ఆర్టీసీ బస్టాండు పరిసర ప్రాంతాల్లో అన్‌రిజిస్టర్డ్ హోటళ్ల పేరిట వ్యాపారం జరుగుతోంది. వాటికి పెనాల్టీలు వెయ్యకుండా ఒక్కొక్కరినుంచి రూ.2 లక్షలు చొప్పున జీఎస్టీ అధికారులు వసూలు చేసినట్టు ఆరోపణలు ఉన్నాయి.
- అనంతపురం పోలీస్ కాంప్లెక్స్ వద్ద ఓ హోటల్‌కు గతంలో ఉన్న అధికారి రూ.1.27 కోట్ల ఫైన్ వేస్తే ప్రస్తుత అధికారి దాన్ని రూ.22 లక్షలకు కుదించి సెటిల్ చేశారు.
- గార్లదిన్నె మండలం కల్లూరు వద్ద ఇటీవల 7 వక్క లారీలు అక్రమంగా రవాణా జరుగుతుండగా వాణిజ్య పన్నుల శాఖ అధికారులు పట్టుకున్నారు. కానీ సరుకు విలువ ఎక్కువగా ఉన్నా తక్కువ చూపించి పెనాల్టీ వేసి లారీ యాజమాన్యాలతో కుమ్మక్కయినట్టు తెలిసింది.
- కొన్ని ఫర్టిలైజర్ షాపులు బిల్లులు లేకుండా అమ్ముతున్నా వారిపై చర్యలు తీసుకోకుండా మామూళ్లు తీసుకుని చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు.

ఏసీబీకి జీఎస్టీ అధికారులు

ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఇటీవలి కాలంలో ఏసీబీకి చిక్కుతున్న వారి సంఖ్య పెరుగుతోంది. మొన్నటికి మొన్న వీఆర్‌ఏ లంచం తీసుకుంటూ చిక్కారు. నిన్న హిందూపురంలో ఏకంగా ముగ్గురు వాణిజ్యపన్నుల శాఖ అధికారులు ఏసీబీకి చిక్కారు. ఏసీబీ అధికారులు అనంతపురం అర్బన్ వైపు దృష్టి సారించాల్సిన అవసరం ఉందన్నది పలువురి అభిప్రాయం.

> **జీరో బిజినెస్ ఎక్కువగా ఉంది**
>
> జిల్లాలో పన్నులు చెల్లించకుండా నడుస్తున్న బిజినెస్ చాలా ఎక్కువగా ఉంది. మాకు ప్రభుత్వం నుంచి అధికారికంగా తనిఖీలు చేయాలని ఆదేశాలు వస్తే తప్ప ఏమీ చేయలేని పరిస్థితి. హోటళ్ల నుంచి వసూళ్లు చేస్తున్న వ్యవహారం నా దృష్టికి రాలేదు.
>
> –హరినాథ్, కమర్షియల్ ట్యాక్స్ అధికారి

రైతులకు సర్కార్ సాయం



మెగా చెక్కు విడుదల చేస్తున్న ఇన్‌చార్జ్ కలెక్టర్ కేతన్‌గార్గ్, చిత్రంలో డీఏఓ చంద్రానాయక్

అనంతపురం అర్బన్: రైతులకు వ్యవసాయంలో పెట్టుబడులకు సాయం, ప్రకృతి విపత్తులతో పంట నష్టపోతే ఇన్‌పుట్ సబ్సిడీ అందిస్తూ ప్రభుత్వం అండగా నిలుస్తోందని ఇన్‌చార్జ్ కలెక్టర్ కేతన్‌గార్గ్ అన్నారు. రైతు సంక్షేమ కార్యక్రమాలతో ప్రభుత్వం ఆదుకుంటోందన్నారు. వైఎస్సార్ రైతు భరోసా – పీఎం కిసాన్ కింద రైతులకు పెట్టుబడి సాయం, ఇన్‌పుట్ సబ్సిడీ పంపిణీ కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మంగళవారం గుంటూరు జిల్లా తెనాలి నుంచి ప్రారంభించారు. కంప్యూటర్ బటన నొక్కి నేరుగా రైతుల ఖాతాల్లోకి సొమ్మును జమ చేశారు. అనంతపురం కలెక్టరేట్ నుంచి ఇన్‌చార్జ్ కలెక్టర్ కేతన్‌గార్గ్, జిల్లా వ్యవసాయ అధికారి (డీఏఓ) చంద్రానాయక్, రైతులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జ్ కలెక్టర్ మాట్లాడుతూ వైఎస్సార్ రైతు భరోసా– పీఎం కిసాన్ కింద జిల్లాలో 2,83,229 మంది రైతులకు రూ.59.11 కోట్లు విడుదలైందన్నారు. గత ఏడాది నవంబర్‌లో మాండూస్ తుపాను కారణంగా పంట నష్టపోయిన 241 మంది రైతులకు రూ.26.70 లక్షల ఇన్‌పుట్ సబ్సిడీ (పెట్టుబడి రాయితీ) విడుదలైందని తెలిపారు. అనంతరం రైతుభరోసా మొత్తానికి సంబంధించి మెగా చెక్కును రైతులతో కలిసి విడుదల చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ, అనుబంధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

కన్నం వేసేవాళ్లను నమ్మొద్దు



ముచ్చుకోట బహిరంగసభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి, చిత్రంలో ఎంపీ తలారి రంగయ్య



- దోచుకోవడం జేసీ సోదరుల నైజం
- ప్రజా సంక్షేమ పాదయాత్రలో ఎమ్మెల్యే పెద్దారెడ్డి ధ్వజం

పెద్దపప్పూరు: నమ్మి ఓటేసిన వారి ఇంటికే కన్నాలు వేసి దోచుకునే రకం జేసీ సోదరులని తాడిపత్రి ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి మండిపడ్డారు. 40 ఏళ్ల రాజకీయ అనుభవం తమదని చెప్పుకునే జేసీ దివాకర్‌రెడ్డి– జేసీ ప్రభాకర్‌రెడ్డిలకు ప్రజల్లో క్రమేణా ఆదరణ తగ్గుతుండటంతో భయం పట్టుకుందన్నారు. కన్నం వేసే వాళ్లను ఎట్టి పరిస్థితుల్లోనూ నమ్మవద్దని ప్రజలకు సూచించారు. పెద్దపప్పూరు మండలం ముచ్చుకోట, వరదాయపల్లి, అమ్మలదిన్నె, జె.కొత్తపల్లి గ్రామాల్లో మంగళవారం 'ప్రజా సంక్షేమ పాదయాత్ర' నిర్వహించారు. ఆయా గ్రామాల్లో నిర్వహించిన బహిరంగ సభల్లో ఎమ్మెల్యే పెద్దారెడ్డి మాట్లాడుతూ జేసీ సోదరులకు పక్కవారు ఎవరైనా బాగుపడితే అసలు నచ్చదన్నారు. దోచుకోవడం.. దాచుకోవడం తప్ప వారికి ప్రజల సంక్షేమం ఏనాడూ పట్టదన్నారు. ముచ్చుకోట రిజర్వాయర్‌కు నీళ్లు విడుదల చేయించాలని ఈ ప్రాంత ప్రజలు ప్రతి ఎన్నికల సమయంలోనూ మొరపెట్టుకుంటున్నారన్నారు. జేసీ సోదరులు మాత్రం ఓట్ల కోసం హామీ ఇచ్చి.. గెలిచిన తర్వాత దాని విస్మరించారన్నారు. తాను 2019 ఎన్నికల ప్రచారంలో ముచ్చుకోటకు వచ్చినపుడు ప్రాజెక్టుకు నీరు విడుదల చేయిస్తానని హామీ ఇచ్చానన్నారు. ఆ మేరకే తాను ఎమ్మెల్యే అయిన తర్వాత ప్రాజెక్టుకు నీరు విడుదల చేయించి, గ్రామంలో అడుగు పెట్టానన్నారు. గ్రామస్తులు హర్షధ్వానాలతో పెద్దారెడ్డికి మద్దతు తెలిపారు. అనంతరం ప్రజాసంక్షేమ పాదయాత్రకు ఎంపీ తలారి రంగయ్య మద్దతు తెలిపి.. ప్రసంగించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు నచ్చితేనే ఏ నాయకుడికైనా మళ్లీ ప్రజలు ఓటేసి గెలిపిస్తారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్రకార్యదర్శి కె.రమేష్‌రెడ్డి, తాడిపత్రి నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల పరిశీలకుడు బీరేంద్రవర్మ తదితరులు పాల్గొన్నారు.

సమష్టిగా విజయభేరి మోగిద్దాం



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి ఉషశ్రీచరణ్, చిత్రంలో ఎంపీ గోరంట్ల మాధవ్, ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య



హాజరైన బూత్ కమిటీ, ఎంపీటీసీ, జెడ్పీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు

- ఎమ్మెల్సీ వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను గెలిపించుకుందాం
- సమీక్ష సమావేశంలో మంత్రి ఉషశ్రీ చరణ్

అనంతపురం రూరల్: ఎమ్మెల్సీ ఎన్నికల్లో సమష్టిగా పనిచేసి విజయభేరి మోగిద్దామని రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి ఉషశ్రీచరణ్ పిలుపునిచ్చారు. వైఎస్సార్‌సీపీ మద్దతుతో పోటీ చేస్తున్న పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డిని, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి రామచంద్రారెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించుకోవాలన్నారు. రుద్రంపేట సమీపంలోని వాల్మీకి భవన్‌లో రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి అధ్యక్షతన నియోజకవర్గ పరిధిలోని వైఎస్సార్‌సీపీ బూత్ కన్వీనర్లు, జెడ్పీటీసీ సభ్యులు, ఎంపీపీ, సర్పంచ్, ఎంపీటీసీ సభ్యులు, గృహ సారథులు, ముఖ్య నాయకులతో ఎమ్మెల్సీ ఎన్నికలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. మంత్రి ఉషశ్రీ చరణ్, హిందూపురం ఎంపీ గోరంట్ల మాధవ్, ఎమ్మెల్సీ మంగమ్మ, ఎమ్మెల్సీ విప్ వెన్నపూస గోపాల్‌రెడ్డి, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, వైఎస్సార్‌సీపీ అనంతపురం జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య, రాప్తాడు నియోజకవర్గ ఎన్నికల పరిశీలకుడు హరీష్‌యాదవ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి ఉషశ్రీచరణ్ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలను చట్ట సభల్లో అడుగు పెట్టేలా చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బడుగుల ఆశాజ్యోతిగా నిలిచారని అన్నారు. 18 ఎమ్మెల్సీ స్థానాల్లో 14 మంది బీసీ, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులను నిలిపిన ఘనత జగన్‌కే దక్కుతుందన్నారు. అంతేకాదు తనకు మంత్రి పదవి, మంగమ్మకు ఎమ్మెల్సీ, గిరిజమ్మకు జెడ్పీ చైర్‌పర్సన్‌తో పాటు వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్ష పదవులు సైతం బీసీలకే కల్పించారన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల విజయం కోసం అందరూ కలసికట్టుగా పనిచేయాలని సూచించారు. మొదటి ప్రాధాన్యత ఓటు వైఎస్సార్‌సీపీ అభ్యర్థులకు వేసేలా ఓటర్లకు అవగాహన కల్పించాలన్నారు.

ముంగిటకే సంక్షేమ పథకాలు

సచివాలయ– వలంటీర్ వ్యవస్థ ద్వారా రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పథకాలను ప్రజల ముంగిటకే చేరుస్తున్నామని ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి పేర్కొన్నారు. రాప్తాడు నియోజకవర్గంలో పరిటాల కుటుంబం గతంలో సాగించిన అరాచక పాలనను ప్రజలు మరిచిపోలేదన్నారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాతే నియోజకవర్గం సస్యశ్యామలంగా మారిందన్నారు. ప్రతి చెరువుకూ నీరందించడంతో పాటు పేరూరు డ్యాంను నీటితో నింపామన్నారు. ఫ్యాక్షన్ రాజకీయాలకు చెక్ పెట్టడంతో నియోజకవర్గ ప్రజలు సంతోషంగా జీవనం గడుపుతున్నారన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల గెలుపునకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఎన్నికల పరిశీలకులు ఎంఆర్‌సీ రెడ్డి పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఎన్నికల విధులు

- ఓటర్లకు స్లిప్పులు పంపిణీ చేయాలి
- అధికారులకు ఇన్‌చార్జ్ కలెక్టర్ కేతన్‌గార్గ్ ఆదేశం



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న ఇన్‌చార్జ్ కలెక్టర్ కేతన్‌గార్గ్, చిత్రంలో డీఆర్వో గాయత్రీదేవి

అనంతపురం అర్బన్: పశ్చిమ రాయలసీమ పట్టభద్ర, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల విధులను అధికారులు అప్రమత్తంగా నిర్వర్తించాలని రిటర్నింగ్ అధికారి, ఇన్‌చార్జ్ కలెక్టర్ కేతన్‌గార్గ్ ఆదేశించారు. ఓటర్ స్లిప్పుల పంపిణీ ప్రారంభించాలని చెప్పారు. ఎన్నికల నిర్వహణ అంశంపై ఇన్‌చార్జ్ కలెక్టర్ మంగళవారం కలెక్టరేట్ నుంచి అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి, డీఆర్వో గాయత్రీదేవి, ఎంసీసీ నోడల్ అధికారి కేశవనాయుడుతో కలిసి పుట్టపర్తి, వైఎస్సార్, అన్నమయ్య, కర్నూలు, నంద్యాల జిల్లాల డీఆర్వోలు, నోడల్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి బ్యాలెట్ పేపర్లను అనంతపురం మినహా మిగలిన ఐదు జిల్లాలకు ఈ నెల 11న ఉదయం తొమ్మిది గంటలకు అనంతపురం కలెక్టరేట్‌లో పంపిణీ చేస్తామన్నారు. ఆయా జిల్లాల నుంచి జిల్లా ఎన్నికల అధికారి అథారిటీ లేఖతో అధికారులను పంపించి బ్యాలెట్ పేపర్లను తగిన బందోబస్తుతో తీసుకెళ్లాలని సూచించారు. 12వ తేదీన పోలింగ్ స్టేషన్లకు చేర్చాలన్నారు. ఎన్నికలకు పటిష్ట బందోబస్తు నిర్వహించాలన్నారు. బహిరంగ సభలు, ర్యాలీలు, వాహనాలకు అనుమతి కోసం జిల్లా కేంద్రాల్లో సింగిల్ విండో సిస్టం ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. మండల, మునిసిపల్ స్థాయిలో ఎంపీడీఓలు, మునిసిపల్ కమిషనర్లతో ఎంసీసీ (మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్) బృందాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఎన్నికల్లో ఓటింగ్ విధానంపై ఈ నెల 3న మండలస్థాయిలో, ఈ నెల 6న గ్రామస్థాయిలో ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని చెప్పారు.

ఓటర్లకు స్లిప్పులు చేర్చండి

ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటర్లుగా ఉన్నవారికి అనంతపురం జిల్లాలో ఓటరు స్లిప్పుల పంపిణీ వెంటనే ప్రారంభించాలని ఇన్‌చార్జ్ కలెక్టర్ కేతన్‌గార్గ్ ఆదేశించారు. ఇతర జిల్లాల్లో ఏడోతేదీలోగా పంపిణీ పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. బూత్ లెవల్ అధికారులు స్లిప్పులను ఓటరుకు అందజేసి సంతకం తీసుకోవాలన్నారు.

బ్యాలెట్ పెట్టెలు భద్రపర్చాలి

ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ 13న పూర్తయిన తరువాత బ్యాలెట్ పెట్టెలను స్ట్రాంగ్‌రూమ్‌కు చేర్చి భద్రపర్చాలన్నారు. ఆ సమయంలో బ్యాలెట్ పేపర్ అకౌంట్, ప్రొసీడింగ్ అధికారి డైరీ, ఇన్సిడెన్స్ రిపోర్ట్ తదితర అంశాలను పరిశీలించుకుని, అక్కడ డిపాజిట్ చేయాలని సూచించారు. 14న అనంతపురంలోని జేఎన్‌టీయూలో ఓట్ల లెక్కింపు కేంద్రం ఏర్పాటు చేస్తామని, ఆయా జిల్లాల నుంచి బ్యాలెట్ పెట్టెలను తగిన బందోబస్తుతో ఇక్కడికి చేర్చాలని తెలిపారు. వచ్చిన సిబ్బందికి ఓట్ల లెక్కింపుపై అదే రోజు శిక్షణ ఇస్తామన్నారు. వీరు 16న ఓట్ల లెక్కింపు విధుల్లో పాల్గొనాల్సి ఉంటుందన్నారు.

వసంత వల్లభా..ఖాద్రీశా

- రేపటి నుంచి లక్ష్మీనారసింహుని బ్రహ్మోత్సవాలు
- 3వ తేదీ శ్రీవారి కల్యాణోత్సవం
- 13న బ్రహ్మ రథోత్సవం



ఖాద్రీ లక్ష్మీ నరసింహ స్వామి ఆలయం

కదిరి: వసంత వల్లభుడిగా, కాటమరాయుడిగా, ప్రహ్లాద వరద లక్ష్మీ నారసింహుడిగా పూజలందుకుంటున్న ఖాద్రీ లక్ష్మీ నరసింహ స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు ఈ నెల 2వ తేదీన అంకురార్పణతో ప్రారంభం కానున్నాయి. పక్షం రోజుల పాటు అత్యంత వైభవంగా జరిగే ఈ ఉత్సవాల్లో రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు కర్ణాటక, తమిళనాడు నుంచి కూడా భక్తులు భారీగా తరలివస్తారు. భక్త ప్రహ్లాద సమేత నారసింహుని దర్శనం ఇక్కడి విశేషం.

నాటి ఖాద్రీనే నేటి కదిరి

శ్రీమహావిష్ణువు దానవుడైన హిరణ్య కశ్యపుని శిక్షించేందుకు, తన భక్తుడైన ప్రహ్లాదుని రక్షించేందుకు నరసింహావతారంలో స్తంభం నుంచి ఉద్భవించాడు. హిరణ్య కశ్యపుని సంహారం అనంతరం ఆ ఉగ్ర రూపంలోనే సమీపంలోని కదిరి కొండ వద్ద సంచరిస్తుండగా...మహర్షులు ఆయన్ను శాంతింపజేసేందుకు ఆ కొండపై నుంచి నారసింహుని వేడుకున్నారు. దీనికి గుర్తుగా ఆ కొండపై నారసింహుని ఆలయం కూడా ఉంది. అదే కొండపై శ్రీవారి పాద ముద్రికలు కూడా ఉన్నాయి. అందుకే ఈ ప్రాంతాన్ని 'ఖాద్రి' అని పిలిచారు. 'ఖా' అంటే విష్ణుపాదమని, 'అద్రి' అంటే కొండ అని అర్థం. ఖాద్రి కాస్త కాలక్రమంలో కదిరిగా పిలవబడుతోంది.

మహిమాన్వితుడు నృసింహుడు

కదిరి ప్రాంతంలో ఒకప్పుడు ఖాదిరి వృక్షాలు(చంద్ర వృక్షాలు)ఎక్కువగా ఉండేవి. ఈ చెట్ల కింద ఒక పుట్టలో నారసింహుడు స్వయంభుగా వెలిశాడని... అందుకే ఖాద్రీ నారసింహుడని పిలుస్తున్నారని మరో కథనం. ప్రతి నెలా స్వాతి నక్షత్రం రోజు ఇక్కడి మూల విరాట్‌కు అభిషేకం చేస్తారు. అభిషేకానంతరం స్వామి హృదయ భాగం నుంచి స్వేద బిందువులు చూడచ్చు. ఇది స్వామివారి మహిమ అని ఇక్కడి భక్తులు భావిస్తారు.

రంగనాయకుల ఆధ్వర్యంలో ఆలయ నిర్మాణం

10వ శతాబ్దంలో అప్పటి పట్నం పాలేగారైన రంగనాయకుడికి చెందిన గోవులు రోజూ ఖాదిరి వృక్షాల కింద ఉన్న ఒక పుట్టలో పాలు వదిలేవి. ఆ పాలను నారసింహుడు తాగేవారని భక్తుల నమ్మకం. అందువల్లనే రంగనాయకులు ఆర్థికంగా బాగా ఎదిగారని ఒక కథనం. ఓ రోజు ఆయనకు శ్రీవారు కలలో కన్పించి తాను స్వయంభుగా వెలిశానని, పుట్టలో ఉన్న తన విగ్రహాన్ని వెలికితీసి తనకు గుడి కట్టించమని కోరితే ఆలయం నిర్మించినట్లు బ్రహ్మాండ పురాణం ద్వారా తెలుస్తోంది. నాటి ఆలయం కాలగతిలో అదృశ్యం కావడంతో బుక్కరాయలు, ఆ తర్వాత హరిహర రాయలు, చివరిగా శ్రీకృష్ణ దేవరాయుల (13 శతాబ్దం నుంచి 15వ శతాబ్దం వరకూ) కాలంలో ఈ గుడి సంపూర్ణ నిర్మాణం జరిగినట్లు చారిత్రక ఆధారాలు చెబుతున్నాయి.

వసంత వల్లభుడని కూడా పేరు

శ్రీ మహావిష్ణువు అనుగ్రహం కోసం భృగు మహర్షి ఈ ప్రాంతంలో తపస్సు చేశాడని, అందుకు మెచ్చిన విష్ణువు తాను కోనేటిలో వెలిశానని, తన విగ్రహాలను వెలికి తీసి పూజాది కార్యక్రమాలు చేయాలని చెప్పినట్లు పూర్వీకులు చెబుతారు. ఈ మేరకు ఉత్సవ విగ్రహాల వెలికితీసి పూజలు చేశారు. అది వసంత మాసంలో జరిగింది కనుక స్వామివారికి వసంత వల్లభుడని పేరు కూడా ఉంది.

బ్రహ్మోత్సవాలు ఇలా...

రెండో తేదీ అంకురార్పణ, మూడో తేదీ శ్రీవారి కల్యాణోత్సవం, నాలుగో తేదీన హంస వాహనోత్సవం, ఐదున సింహ వాహనోత్సవం, ఆరున హనుమంత వాహనోత్సవం, ఏడున బ్రహ్మ గరుడ సేవ, ఎనిమిదిన శేష వాహనోత్సవం, తొమ్మిదిన సూర్య, చంద్ర ప్రభ, పదిన మోహినీ ఉత్సవం, పదకొండో తేదీన ప్రజా గరుడ సేవ, 12న గజ వాహనోత్సవం, 13న బ్రహ్మ రథోత్సవం(తేరు), 14న అలుకోత్సవం, 15న తీర్థవాది ఉత్సవం, 16న పుష్ప యాగోత్సవం జరుగుతాయి.

S.I. & P.C "MAINS" (TM/EM)
'45' DAYS SPECIAL BATCH
NEW BATCH : 01-03-23 (WED)
Time: 9-30 AM to 5-30 PM
RMC Opp:Nandini Hotel, Sapthagiri Circle, ATP.

క్లుప్తంగా

బ్రహ్మోత్సవాల్లో మంత్రి ఉషశ్రీచరణ్



గవి సిద్ధేశ్వరస్వామికి పూజలు నిర్వహిస్తున్న మంత్రి ఉషశ్రీచరణ్

ఉరవకొండ: గవిమఠం చంద్రమౌళీశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో రాష్ట్ర శిశు, సంక్షేమ శాఖ మంత్రి ఉషశ్రీచరణ్ మంగళవారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె వెంట ఎమ్మెల్సీ మంగమ్మ, ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వర రెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య, పార్టీ నియోజకవర్గ పరిశీలకులు శ్రీనివాసులు, ఎంఆర్‌సీ రెడ్డి ఉన్నారు. ముందుగా గుహలో వెలసిన గవిసిద్దేశ్వర స్వామికి మంత్రితో పాటు ప్రజాప్రతినిధులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మఠం పీఠాధిపతి జగద్గురు చెన్నబసవరాజేంద్రస్వామి ఆశీర్వాదం తీసుకున్నారు. కార్యక్రమంలో ఎంపీపీలు చంద్రమ్మ, పుష్పవతి, జెడ్పీటీసీ సభ్యురాలు ఏసీ పార్వతమ్మ, సర్పంచుల లలితమ్మ, మోనాలిసా పాల్గొన్నారు.

పార్టీ అభ్యర్థుల విజయమే లక్ష్యం

- అనంతపురం ఎంపీ తలారి రంగయ్య



మాట్లాడుతున్న ఎంపీ రంగయ్య

అనంతపురం సప్తగిరి సర్కిల్: పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల విజయమే లక్ష్యంగా పనిచేయాలని పార్టీ శ్రేణులకు అనంతపురం ఎంపీ తలారి రంగయ్య పిలుపునిచ్చారు. అనంతపురంలోని తన క్యాంప్ కార్యాలయంలో మంగళవారం బీసీ సంఘాల నేతలు, శ్రేయోభిలాషులతో ఆయన సమావేశమై మాట్లాడారు. పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి వెన్నపూస రవీంద్రారెడ్డి, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి రామచంద్రారెడ్డి వైఎస్సార్‌సీపీ తరఫున బరిలో నిలిచారని గుర్తు చేశారు. భారీ మెజారిటీతో ఈ ఇద్దరిని గెలిపించేందుకు సమష్టిగా కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డి, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆఫీస్ ఆటోమేషన్ (CPT-Computer Proficiency Test) కోర్సు ఫీజులో 20% రాయితీతో దరఖాస్తులు
APPSC ద్వారా Group- 2 & 3 Jobs కి మరియు డేటా ఎంట్రీ ఆపరేటర్, సచివాలయాల్లో డిజిటల్ అసిస్టెంట్ & డేటా ప్రాసెసింగ్ మొదలగు ఉద్యోగాలకు AP SBTET ద్వారా Pass అయిన సర్టిఫికెట్ ఉపయోగపడును.
SAI INSTITUTION
(Affiliated by APSBTET),
14/402, Kamala Nagar, ATP.
Cell : 9059723829
Application Last Date : 13-03-2023
Exam Date : April / May 2023

తనివి తీరా... దాహం తీరేలా

- జల జీవన్ మిషన్ ద్వారా తీరనున్న తాగునీటి కష్టాలు
- ఇంటింటా కుళాయి కనెక్షన్ల ఏర్పాటు ప్రక్రియ వేగవంతం
- ప్రతి వ్యక్తికీ 55 లీటర్ల సురక్షిత నీరు అందేలా చర్యలు
- జిల్లాలో రూ.508 కోట్లతో 1,633 పనుల గుర్తింపు
- 120 గ్రామాల్లో వంద శాతం పనుల పూర్తి
- వేసవి ఎద్దడిని ఎదుర్కొనేలా ప్రణాళికలు

రాయదుర్గం: కరువు జిల్లాగా పేరు గాంచిన 'అనంత'లో జలసిరులు పెరిగి వ్యవసాయం కొత్త పుంతలు తొక్కుతోంది. ఈ క్రమంలో ప్రజల దాహార్తి తీర్చేలా జగన్ సర్కార్ చొరవతో ఇంటింటా కుళాయి కనెక్షన్ల ఏర్పాటు ప్రక్రియ శరవేగంగా సాగుతోంది. తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా అమల్లోకి తీసుకొచ్చిన 'జలజీవన్' పథకం పనులు ఊపందుకున్నాయి. సీజన్ ఏదైనా ప్రతి వ్యక్తికీ 55 లీటర్ల స్వచ్ఛమైన తాగునీరందించాలన్నదే సీఎం జగన్ సంకల్పం. దీంతో 1,633 పనులు గుర్తించి రూ.508 కోట్లతో పనులు చేపట్టారు. జిల్లా వ్యాప్తంగా గ్రామీణ ప్రాంతాల్లో 4,25,917 కుటుంబాలకు గాను ఇప్పటికే 3,33,180 కుటుంబాలకు కుళాయి కనెక్షన్లు ఇచ్చారు. ఇందులో 122 గ్రామాల్లో దాదాపు ప్రతి ఇంటికీ కుళాయి కనెక్షన్ల ఏర్పాటు ప్రక్రియ పూర్తయింది. మిగిలిన 92,737 కనెక్షన్లను 2024 నాటికి పూర్తి చేసేలా కార్యచరణ సిద్ధం చేశారు.

ప్రతి ఇంటికీ కొళాయి

జలజీవన్ పథకం ప్రారంభించిన గ్రామంలో ప్రతి ఇంటికీ కుళాయి కనెక్షన్ ఇవ్వాలన్నదే ప్రభుత్వ లక్ష్యం. ఈ కారణంగా తాగునీటి వనరుల లభ్యత, సమస్యను అధిగమించడం, అవసరమైనచోట అధనపు బోర్లు తవ్వడం, తాగునీటి ట్యాంకులు, పైప్‌లైన్ల నిర్మాణం చేపట్టే పనులకు ప్రాధాన్యత కల్పించారు.

ధనవంతులకే కుళాయి ఉండేవి..

స్వాతంత్ర్యం వచ్చి దశాబ్దాలు గడిచినా గ్రామీణ ప్రాంతాల్లో నేటికీ ధనవంతుల ఇళ్లకు మాత్రమే కుళాయి కనెక్షన్లు ఉండేవి. పేద, మధ్య తరగతి ప్రజలకు పబ్లిక్ కొళాయిలు, సిస్టన్ ట్యాంకులే దిక్కయ్యాయి. దీంతో గంటల తరబడి నీటి పథకాల వద్ద ప్రజలు బారులు తీరేవారు. అయినా అవసరానికి తగినన్ని నీళ్లు దొరికేవి కావు. జల జీవన్ పథకం అమల్లోకి రావడంతో కులమతాలు, రాజకీయాలకు అతీతంగా ఇంటింటికీ కుళాయి కనెక్షన్ ఏర్పాటుకు జగన్ సర్కార్ శ్రీకారం చుట్టింది.



పైప్‌లైన్ ఏర్పాటుకు కొలతలు తీస్తున్న దృశ్యం

నిరంతర నీటి సరఫరా ఉండేలా

గతంలో వేసవి మొదలైందంటే చాటు జిల్లాలో తాగునీటి ఇబ్బందులు తలెత్తి ప్రజలు ఇబ్బంది పడేవారు. గత టీడీపీ హయాంలో మెజార్టీ గ్రామాల్లో ఈ సమస్య ఉత్పన్నమైంది. వర్షాభావ పరిస్థితుల కారణంగా భూగర్భ జలాలు అడుగంటి నీటి పథకాలు నిర్వీర్యమయ్యాయి. ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేపట్టాల్సి వచ్చింది. రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత విస్తారంగా వర్షాలు కురిశాయి. ఈ కారణంగా బీటలు వారిన జలాశయాలు, కుంటలు, చెరువులు నిండు కుండను తలపిస్తున్నాయి. దీంతో అనూహ్యంగా భూగర్భ జలాలు పెరిగి తాగునీటి కష్టాలు దూరమయ్యాయి. దీనికి జలజీవన్ పథకం తోడు కావడంతో ప్రతి ఇంటికీ శుద్ధ నీటి జలాల పంపిణీ ప్రక్రియ వేగవంతమైంది.

వ్యవసాయ పొలాలే దిక్కు



గతంలో బిందెడు నీటికి సైతం కష్టాలు అనుభవించాం. బోర్లలో తాగునీరు అడుగంటి పోవడంతో ఎడ్లబండి కట్టుకుని వ్యవసాయ బోరు బావుల వద్దకెళ్లే వాళ్లం. ప్రస్తుతం ఆ పరిస్థితి లేదు. ఇంటికే ఉచితంగా కుళాయి కనెక్షన్ ఇచ్చారు.

– రూప, అడిగుప్ప గ్రామం, రాయదుర్గం మండలం

ఊరంతా కొళాయిలే



మా పంచాయతీ పరిధిలోని అడిగుప్పలో 140 ఇళ్లున్నాయి. వాటన్నింటికీ జలజీవన్ పథకం కింద పైప్‌లైన్లు ఏర్పాటు చేసి నీటి కుళాయిలు అమర్చాం. ప్రతి కుటుంబానికి సరిపడేంత నీరు అందిస్తున్నాం. గతంలో నీటి కోసం అడిగుప్ప వాసులు ఎన్నో ఇబ్బందులు పడ్డారు. ప్రస్తుతం ఆ కష్టాలన్నీ దూరం చేశాం.

– ఎస్.రమేష్, సర్పంచ్, కేపీదొడ్డి

పనుల్లో వేగవంతం



వేసవిని దృష్టిలో ఉంచుకుని జలజీవన్ పనుల్లో మరింత పురోగతి సాధించేలా చర్యలు చేపట్టాం. ఈ ఏడాది ఆఖరులోపు వంద శాతం లక్ష్యాన్ని చేరుకునేలా కృషి చేస్తున్నాం. ప్రస్తుతం జిల్లాలో ఈ పనులు ఊపందుకున్నాయి. ప్రజలకు ఇబ్బందులు లేకుండా తాగునీరందించేలా ప్రణాళికలు చేపట్టాం.

– జయకుమార్, ఈఈ, ఆర్‌డబ్ల్యూఎస్

అంతర్రాష్ట్ర దొంగ అరెస్ట్

- రూ.7.56 లక్షల విలువైన బంగారు నగలు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన జీఆర్‌పీ డీఎస్పీ అబ్దుల్ అజీజ్



నిందితుడిని అరెస్ట్ చూపుతున్న రైల్వే పోలీసులు

గుంతకల్లు: కదులుతున్న రైళ్లు, ప్లాట్‌ఫాంలపై చోరీలకు పాల్పడుతున్న ఓ అంతర్రాష్ట్ర దొంగను రైల్వే పోలీసులు అరెస్ట్ చేశారు. స్థానిక జీఆర్పీ డీఎస్పీ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నిందితుడి వివరాలను జీఆర్పీ డీఎస్పీ అబ్దుల్ అజీజ్ వెల్లడించారు. జీఆర్పీ ఎస్పీ చౌడేశ్వరి ఆదేశాల మేరకు రైళ్లలో చోరీల నియంత్రణకు జీఆర్పీ పటిష్ట చర్యలు తీసుకుంది. ఇందులో భాగంగా మంగళవారం ఉదయం గుంతకల్లు రైల్వే స్టేషన్‌లో అనుమానాస్పదంగా తిరుగుతున్న ఆకాష్‌ను రైల్వే పోలీసులు అడ్డుకుని వివరాలు ఆరా తీస్తుండగా పారిపోయేందుకు ప్రయత్నించాడు. ఆ సమయంలో సీఐ బీవీ నగేష్, సిబ్బంది వెంటాడి ఆకాష్‌ను అదుపులోకి తీసుకుని రైల్వే పోలీసు స్టేషన్‌కు తరలించారు. అతని వద్ద నుంచి 130 గ్రాముల బంగారు నగలు స్వాధీనం చేసుకున్నారు. విచారణలో తన పూర్తి పేరు ఆకాష్ ప్రతాప్‌సరోదిగా పేర్కొన్నాడు. మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లా ఖందార్ తాలూకా భీమినగర్‌కు చెందినవాడు. ప్రస్తుతం లాథూర్ జిల్లా అహమ్మద్‌పూర్ లోని హనుమాన్ తికడిలో నివాసముంటున్నాడు.

జల్సాలకు అలవాటు పడిన ఆకాష్.. బేల్దారి పనులతో వచ్చే సంపాదన తన అవసరాలకు సరిపోకపోవడంతో దొంగతనాలు చేయడం మొదలు పెట్టాడు. మూడేళ్ల క్రితం తిరుపతిలోని గోవిందరాజుల స్వామి ఆలయంలో బంగారు కిరీటాలు అపహరించుకెళ్లాడు. ఈ కేసులో పట్టుబడి జైలు శిక్ష కూడా అనుభవించాడు. అనంతరం బయటకు వచ్చిన ఆకాష్ రైళ్లల్లో చోరీలను ఎంచుకున్నాడు. ప్లాట్‌ఫాంలపై, రైళ్లలో నిద్రిస్తున్న ప్రయాణికుల బ్యాగ్‌లు అపహరించుకెళ్లేవాడు. రైలు కదులుతున్న సమయంలో మహిళల మెడలోని బంగారు నగలు లాక్కొని ఉడాయించేవాడు. ఇప్పటికే ఆకాష్‌పై పలు రాష్ట్రాల్లో కేసులు నమోదయ్యాయి. విచారణ అనంతరం నిందితుడు దాచి ఉంచిన రూ.7,56,900 లక్షల విలువ చేసే బంగారు నగలు స్వాధీనం చేసుకున్నారు. అంతర్రాష్ట్ర దొంగను పట్టుకోవడంలో చొరవ చూపిన జీఆర్పీ సీఐ నగేష్, ఎస్ఐలు మహేంద్ర, గోపాల్, హెడ్ కానిస్టేబుళ్లు రాజశేఖర్, సాయి, శరేశ్వరరావు, కానిస్టేబుళ్లు ప్రకాష్, అలీ, నబీరసూల్, గాదిలింగ, నరసింహ, పుల్లయ్య, గోపాల్‌ను ఈ సందర్భంగా డీఎస్పీ అభినందించారు. విలేకరుల సమావేశంలో ఆర్పీఎఫ్ సీఐ పి.రమేష్‌గౌడ్, ఇంటిలిజెన్స్ ఇన్‌స్పెక్టర్ బెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

యువకుడిపై పోక్సో కేసు నమోదు

బుక్కరాయసముద్రం: మండలంలోని చెన్నంపల్లికి చెందిన ఓ యువకుడిపై పోలీసులు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. అదే గ్రామానికి చెందిన ఓ బాలికను పవన్‌కుమార్ అనే యువకుడు మాయమాటలు చెప్పి గత నెల 3వ తేదీన తన వెంట పిలుచుకెళ్లాడు. విషయాన్ని ఆలస్యంగా గుర్తించిన తల్లిదండ్రులు.. బాలిక ఆచూకీ కోసం పలు ప్రాంతాల్లో గాలించారు. ఫలితం లేకపోవడంతో అప్పట్లో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం సాయంతో విజయవాడలో పవన్‌కుమార్ ఉన్నట్లు గుర్తించారు. దీంతో పోలీసులు అక్కడికెళ్లి యువకుడితో పాటు బాలికను అదుపులోకి తీసుకుని మంగళవారం బీకేఎస్ పోలీస్ స్టేషన్‌కు తీసుకువచ్చారు. విచారణ అనంతరం యువకుడిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శివప్రసాద్ తెలిపారు.

వంద శాతం ఉత్తీర్ణతపై దృష్టి సారించండి

నార్పల: పదో తరగతి పరీక్షల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధనకు కృషి చేయాలని ఉపాధ్యాయులు, విద్యార్థులకు డీఈఓ సాయిరాం సూచించారు. నార్పల మండలం గూగూడులోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం ఏర్పాటు చేసిన సైన్స్‌ఫేర్‌ను ఆయన పరిశీలించారు. అనంతరం కేజీబీవీని తనిఖీ చేశారు. నైట్ విజన్ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులతో మాట్లాడారు. ప్రణాళికబద్ధంగా చదివితే విజయం సొంతమవుతుందని సూచించారు. ఈ సందర్భంగా ఆయన వెంట ఎంఈఓ కృష్ణయ్య ఉన్నారు.

రాష్ట్రస్థాయి సైన్స్‌ఫేర్‌లో సత్తా చాటిన జిల్లా విద్యార్థులు

అనంతపురం: గత నెల 27, 28 తేదీల్లో విజయవాడలోని ఆంధ్ర లయోల కళాశాల వేదికగా సాగిన రాష్ట్ర స్థాయి సైన్స్‌ఫేర్‌లో ఉమ్మడి అనంతపురం జిల్లాకు చెందిన ఇద్దరు విద్యార్థులు ప్రతిభ చాటారు. హెల్త్ అండ్ క్లీన్ నెస్ విభాగం అనంతపురం జిల్లా శెట్టూరు మండలం కైరేవు ఎంపీయూపీఎస్ విద్యార్థి జి.భానుప్రియ ద్వితీయ స్థానాన్ని, శ్రీసత్యసాయి జిల్లా నాగసముద్రంలోని జెడ్పీహెచ్ఎస్ విద్యార్థి ఎస్.లక్ష్మీనరసింహ తృతీయ స్థానాన్ని దక్కించుకున్నారు.

88 మంది సచివాలయ ఉద్యోగులకు షోకాజ్

రాప్తాడు రూరల్: అనంతపురం మండలంలోని సచివాలయాల్లో పనిచేస్తున్న 88 మంది ఉద్యోగులకు ఉన్నతాధికారులు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. బయోమెట్రిక్ హాజరు నమోదులో అలసత్వమే ఇందుకు కారణంగా తెలుస్తోంది. మండల వ్యాప్తంగా మొత్తం 302 మంది సచివాలయ ఉద్యోగులు ఉండగా గత నెల 18 నుంచి 25వ తేదీ వరకూ 20 మంది ఉద్యోగులు బయోమెట్రిక్ హాజరు నమోదు చేయలేదు. అలాగే మరో 68 మంది వంద శాతం హాజరు నమోదులో నిర్లక్ష్యం కనబరిచారు. సెలవులను ఆన్‌లైన్‌లో పొందుపరచలేదు. దీంతో 88 మంది సచివాలయ ఉద్యోగులకు ఏపీ సివిల్ సర్వీసెస్ రూల్స్ 1964 కింద క్రమశిక్షణ చర్యలు ఎందుకు తీసుకోకూడదంటూ ఎంపీడీఓ బాబాఫకృద్దీన్ మంగళవారం నోటీసులు జారీ చేశారు. మూడు రోజుల్లోపు సంజాయిషీ ఇవ్వకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు.

లక్ష్యానికి చేరువగా స్త్రీనిధి రుణాల మంజూరు

- ఉమ్మడి జిల్లా స్త్రీనిధి ఏజీఎం కామాక్షయ్య



మాట్లాడుతున్న ఏజీఎం కామాక్షయ్య

కూడేరు: ఉమ్మడి జిల్లాలో 2022–23 ఆర్థిక సంవత్సరానికి గాను రూ.310 కోట్ల స్త్రీ నిధి రుణాలు మంజూరు లక్ష్యంగా నిర్దేశించుకోగా.. ఇప్పటి వరకూ రూ.235 కోట్లను డ్వాక్రా మహిళలకు మంజూరు చేసినట్లు స్త్రీనిధి ఏజీఎం కామాక్షయ్య తెలిపారు. కూడేరు మండలానికి సంబంధించి రూ.5 కోట్ల రుణాలు మంజూరు లక్ష్యంగా నిర్దేశించుకోగా.. రూ.3.5 కోట్లు మాత్రమే మంజూరు చేయడంపై మంగళవారం ఆయన క్షేత్రస్థాయి పరిశీలన చేపట్టారు. వెనకబాటుకు కారణాలను ఏపీఎం, సీసీలు, యానిమేటర్లతో ఆరా తీశారు. ఈ నెలాఖరుకు నిర్దేశించిన లక్ష్యం నెరవేరాలని ఆదేశించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. అనంతపురం జిల్లాకు రూ.150 కోట్ల టార్గెట్‌కు గాను రూ.110 కోట్లు, శ్రీసత్యసాయి జిల్లాలో రూ.160 కోట్లకు గాను రూ.125 కోట్ల స్త్రీనిధి రుణాలు మంజూరు చేసినట్లు పేర్కొన్నారు. ఇందులో 96 శాతం వసూళ్లు పక్కాగా జరిగాయన్నారు. సిబ్బంది అలసత్వం కారణంగా రూ.5 కోట్ల రుణాల వసూళ్లలో జాప్యం చోటు చేసుకుంటోందని, ఈ పరిస్థితిని అధిగమించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. బ్యాంకులతో సంబంధం లేకుండా మంజూరు చేసే ఈ రుణాలను సద్వినియోగం చేసుకునేలా మహిళా సంఘాలను చైతన్య పరచనున్నామన్నారు. రుణాల చెల్లింపు విషయంలో ఎలాంటి పరిస్థితుల్లోనూ నగదును సిబ్బంది చేతికి ఇవ్వరాదని, సంఘం ఖాతాల్లోకి నేరుగా జమ చేయడమో, ఫోన్‌పే ద్వారా జమ చేయడమో చేయాలని సూచించారు. తప్పనిసరి పరిస్థితుల్లో సిబ్బంది చేతికి నగదు అందజేస్తే అందుకు తగిన రసీదు తక్షణమే తీసుకోవాలన్నారు. స్త్రీనిధి రుణం మంజూరు, వసూళ్లలో అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని సిబ్బందిని హెచ్చరించారు. ఇప్పటికే ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 8 మందిపై సస్పెన్షన్ వేటు వేసినట్లు గుర్తు చేశారు.

నేటి నుంచి జెడ్పీ స్థాయీ సంఘాల సమావేశాలు

అనంతపురం సిటీ: ఉమ్మడి జిల్లా పరిషత్ స్థాయీ సంఘాల సమావేశాలు బుధవారం ప్రారంభం కానున్నట్లు సీఈఓ భాస్కర్‌రెడ్డి మంగళవారం తెలిపారు. రెండ్రోజుల పాటు జరిగే సమావేశాల్లో తొలి రోజు స్థాయీ సంఘం–1, 3, 7 (ఆర్థిక, ప్రణాళిక/వ్యవసాయం/ఇంజినీరింగ్ శాఖలు) సమావేశాలు ఉంటాయన్నారు. జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, స్థాయీ సంఘాల అధ్యక్షుల అధ్యక్షతన జరిగే సమావేశాలకు అధికారులు కచ్చితంగా హాజరు కావాలని పేర్కొన్నారు. గత సమావేశాల్లో జరిగిన చర్చలు, లేవనెత్తిన అంశాలకు సంబంధించి తీసుకున్న చర్యలపై చర్చించాల్సి ఉంటుందన్నారు.

బరిలో ఎంయూ, ఈఎస్

గుంతకల్లు: గుంతకల్లు రైల్వే ఇన్‌స్టిట్యూట్ పాలక వర్గం ఎన్నికలకు సంబంధించి నామినేషన్ల పర్వం మంగళవారం ముగిసింది. దక్షిణ మధ్య రైల్వే మజ్దూర్ యూనియన్, ఎంప్లాయీస్ సంఘ్ మధ్య ప్రధాన పోటీ నెలకొంది. ఈ మేరకు వెల్ఫేర్ ఇన్‌స్పెక్టర్ విజయ్ కుమార్ తెలిపారు. గత నెల 23న ప్రారంభమైన నామినేషన్ల ప్రక్రియ ముగియడంతో ఈ నెల 1న పోటీలో ఉన్న అభ్యర్థులను ప్రకటించనున్నారు. 3వ తేదీ వరకూ నామినేషన్ల ఉపసంహరణకు గడువు ఇచ్చారు. 4న గుర్తులు కేటాయించి, 10వ తేదీ పోలింగ్ నిర్వహించనున్నారు. అదే రోజు విజేతలను ప్రకటిస్తారు.

బరిలో వీరే.. : రైల్వే ఇనిస్టిట్యూట్ పాలక వర్గానికి మజ్దూర్ యూనియన్ ప్యానల్ కింద కార్యదర్శి స్థానానికి మేఘశ్యామ్, సహాయ కార్యదర్శిగా మునీర్‌బాషా, కోశాధికారిగా కె.యల్లప్పతో పాటు ఆరుగురు కార్యవర్గ సభ్యుల పదవులకు నామినేషన్లు దాఖలయ్యాయి. అలాగే దక్షిణ మధ్య రైల్వే ఎంప్లాయీస్ సంఘ్ ప్యానల్ నుంచి కార్యదర్శిగా మల్లికార్జున, సహాయ కార్యదర్శిగా గోపీమునికుమార్, కోశాధికారిగా రవితోపాటు మరో ఆరుగురు సభ్యులుగా నామినేషన్లు దాఖలు చేశారు.

దారి దోపిడీపై దర్యాప్తు ముమ్మరం

- ముఠా సభ్యుల జాడకోసం అన్వేషణ
- రంగంలోకి 8 బృందాలు

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: నాలుగు రోజుల క్రితం రాప్తాడు మండలం, హంపాపురం హైవేపై జరిగిన దారి దోపిడీపై అనంత పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. బెంగళూరుకు చెందిన వ్యాపారి బాబూరావు షిండే, అతని బంధువు ఇటీవల హైదరాబాద్‌లో బంగారాన్ని విక్రయించగా వచ్చిన సొమ్ము తీసుకుని తిరుగు ప్రయాణమయ్యారు. హంపాపురం వద్ద కొందరు యువకులు అడ్డుకుని దాడి చేసి నగదు అపహరించుకెళ్లారు. ఈ కేసు ఛేదింపును అనంత పోలీసులు సవాలుగా తీసుకున్నారు. ముగ్గురు డీఎస్పీల నేతృత్వంలో 8 బృందాలు రంగంలోకి దిగాయి. ఇప్పటికే వ్యాపారి బాబూరావు షిండే, అతని బంధువుతో పాటు పలువురి నుంచి కీలక విషయాలు సేకరించిన పోలీసులు నిందితుల గుర్తింపులో వ్యూహాత్మకంగా పావులు కదుపుతున్నారు.

ప్రజారోగ్యంపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు : డీఎంహెచ్‌ఓ



వైద్య సేవలపై ఆరా తీస్తున్న డాక్టర్ వీరబ్బాయి

కూడేరు: ప్రజారోగ్యానికి రాష్ట్ర ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యతనిస్తోందని, ఈ క్రమంలో వైద్యసేవలు అందించడంలో నిర్లక్ష్యం వహిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని వైద్య, ఆరోగ్య సిబ్బందిని జిల్లా వైద్యాధికారి డాక్టర్ వీరబ్బాయి హెచ్చరించారు. మంగళవారం ఆయన కూడేరు పీహెచ్‌సీని ఆకస్మిక తనిఖీ చేశారు. పలు రికార్డులు, ఆస్పత్రి లోపల, బయట పరిశుభ్రతను, వార్డులను, మందుల గదిని పరిశీలించారు. పీహెచ్‌సీలో అందిస్తున్న వైద్య సేవలపై రోగులతో ఆరా తీశారు. అనంతరం సిబ్బందితో మాట్లాడుతూ.. పీహెచ్‌సీల్లోనే ప్రసవాలు జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. గర్భిణులకు ఆరోగ్య సూత్రాలు, పోషకాహారంపై అవగాహన కల్పించి, మాతాశిశు మరణాలు చోటు చేసుకోకుండా చూడాలన్నారు. ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం పక్కాగా అమలు కావాలని ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా క్షయ నివారణాధికారి డాక్టర్ అనుపమ జేమ్స్, మండల వైద్యాధికారి డాక్టర్ లక్ష్మీనారాయణ, సీహెచ్‌ఓ మోహన్‌బాబు, హెల్త్ అసిస్టెంట్ శ్రీనివాసులు, సూపర్‌వైజర్ వెంకటలక్ష్మమ్మ, ల్యాబ్ టెక్నీషియన్ కిరణ్, ఫార్మసిస్ట్ బాబు, సిబ్బంది పాల్గొన్నారు.

పెళ్లి కాలేదన్న బెంగతో యువకుడి ఆత్మహత్య

రాయదుర్గం: మూడు పదుల వయసు వచ్చినా పెళ్లి కాలేదన్న బెంగతో ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు... రాయదుర్గంలోని శాంతినగర్‌కు చెందిన వంగా రాజశేఖర్ (33)కు పెళ్లి చేసేందుకు కుటుంబసభ్యులు సంబంధాలు చూస్తున్నారు. ఇందులో ఏ ఒక్కటీ కుదరలేదు. ఈ క్రమంలోనే తన తోటి మిత్రులందరికీ పెళ్లిలవుతుండంతో రాజశేఖర్ కొంత కాలంగా మానసికంగా కుదేలయ్యాడు. ఇటీవల తండ్రి సుంగులప్ప మృతి చెందాడు. నలుగురు అన్నదమ్ముల్లో మూడో వాడిగా ఉన్న తనకు ఇక పెళ్లి జరగడం కష్టమనే భావన అతణ్ని మరింత వేధించసాగింది. దీంతో మంగళవారం ఉదయం జీన్స్ ప్యాంట్ల తయారీకి ఏర్పాటు చేసుకున్న ప్రత్యేక గదిలో పైకప్పుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న రాయదుర్గం ఎస్ఐ సుమన్.. అక్కడకు చేరుకుని పరిశీలించి కేసు నమోదు చేశారు.

వ్యక్తి బలవన్మరణం



ఈరన్న (ఫైల్)

కుందుర్పి: అప్పులు తీర్చే మార్గం కానరాక ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు.. కుందుర్పి మండలం బెస్తరపల్లికి చెందిన గొల్ల ఈరన్న (47)కు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. వ్యవసాయ పనులతో పాటు చింత పండు వ్యాపారం చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. గతంలో సాగు చేసిన పంటలకు గిట్టుబాటు ధర లేక రూ.2.40 లక్షల నష్టం వచ్చింది. ఈ క్రమంలోనే చింతపండు వ్యాపారంలోనూ రూ.2.60 లక్షలు నష్టపోయాడు. దీంతో రూ.5 లక్షల అప్పులు ఎలా తీర్చాలో తెలియక వారం రోజులుగా మదనపడేవాడు. దీంతో మంగళవారం ఉదయం ఇంట్లో ఎవరూ లేని సమయంలో దూలానికి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ కృష్ణమూర్తి తెలిపారు.

నేటి నుంచి ఉచిత బియ్యం పంపిణీ

అనంతపురం అర్బన్: జిల్లాలోని బియ్యం కార్డుదారులకు మార్చి నెలకు సంబంధించి బుధవారం నుంచి బియ్యం ఉచితంగా పంపిణీ చేస్తారని ఇన్‌చార్జ్ కలెక్టర్ కేతన్‌గార్గ్ తెలిపారు. కార్డులోని ప్రతి సభ్యునికీ పౌష్టికమైన (ఫోర్టిఫైడ్) బియ్యం ఐదు కిలోల చొప్పున, అంత్యోదయ అన్నయోజన (ఏఏవై) కార్డుదారులకు 35 కిలోలు ఉచితంగా ఇస్తారన్నారు. ఏఏవై కార్డుదారులకు చక్కెర కిలో రూ.13.50కు, మిగతా కార్డుదారులకు అర కిలో రూ.17 ప్రకారం ఇస్తారని తెలిపారు. కంది పప్పు కిలో రూ.67 చొప్పున ఇస్తారని పేర్కొన్నారు. ఎండీయూల (బియ్యం పంపిణీ వాహనాలు) ద్వారా కార్డుదారుల ఇంటి వద్దకే వచ్చి బియ్యం, సరుకులు పంపిణీ చేస్తారన్నారు. పంపిణీ సజావుగా జరిగేలా చర్యలు తీసుకోవాలని తహసీల్దార్లు, సీఎస్‌డీటీలను ఆదేశించామన్నారు.

పొరపాట్లకు తావివ్వొద్దు



మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ నరసింహారెడ్డి

అనంతపురం అర్బన్: ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ విధుల్లో ఎలాంటి పొరపాట్లకు తావివ్వరాదని పోలింగ్ సిబ్బందికి శిక్షణ నోడల్ అధికారి, డీఆర్‌డీఏ పీడీ ఐ.నరసింహారెడ్డి సూచించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవన్‌లో ప్రిసైడింగ్, పోలింగ్ అధికారుల శిక్షణ కార్యక్రమం జరిగింది. ప్రిసైడింగ్ అధికారి చేపట్టాల్సిన విధులు, బాధ్యతలపై ఈ సందర్భంగా పీడీ అవగాహన కల్పించారు. పోలింగ్ సామగ్రి, ఎలక్టోరల్ రోల్స్, ఓటింగ్ కంపార్ట్‌మెంట్స్, బ్యాలెట్ పెట్టెల నిర్వహణ, వివిధ ఫారమ్‌లను పూరించడం తదితర అంశాలపై 135 మంది ప్రిసైడింగ్ అధికారులు, 143 మంది పోలింగ్ అధికారులు, 16మంది సెక్టార్ అధికారులు, 16 మంది రూట్ అధికారులకు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ ప్రశాంత్‌కుమార్, ఆర్డీఓలు రవీంద్ర, నిషాంత్‌రెడ్డి, మధుసూదన్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

REAL ESTATE

PLOT FOR SALE

■ GMR COLONY, Alamuru Road, Anantapur. AHUDA approved open plots for sale. Cont: 9392183377, 9281024684, 9391756322. [A-456]

■ HIGHWAY COUNTY, Beside APS Warehousing Godowns, near SVIT, NH 44, AHUDA approved plots for sale. 9392183377, 9281024684, 9391756322. [A-457]

■ GREEN COUNTY, Rapthadu, NH 44, AHUDA approved open plots for sale. Cont: 9392183377, 9281024684, 9391756322. [A-458]

SERVICES

బంగారం కొనబడును

■ మీ బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్స్ / ఫైనాన్స్‌లో తాకట్టులో ఉన్నవి, మా డబ్బుతో విడిపించి కొనబడును. స్పాట్ క్యాష్ / షిఫ్టింగ్ (రిటైర్డ్ పోలీస్ డిపార్ట్‌మెంట్) గోల్డ్‌ట్రేడింగ్ కం. ఫోన్: 73821 14647 [V-6087]

GOLD FINANCE

■ బంగారం బ్యాంకులలో/ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్) (100% జెన్యూన్) ✆ 90009 92521 [B-2281]

WANTED

■ MS ENTERPRISES (DSA) HIRING Female Telecallers, Salary 8000 + Incentives, Q: DEGREE, Location. Bellary bypass, ATP. 9121510154, 8466860623. [A-433]

■ Corporate బ్యాంక్‌లలో పనిచేయుటకు Cashiers, Clerks,Senior Officer, (Sales) Attenders కావలెను. జీ: 12,000 –40,000 వరకు. ✆ 9642506425, 8297797197. [T-4032]

■ మా ఆఫీస్‌లో వర్క్ చేయుటకు లేడి టెలికాలర్స్ కావలెను. Q : 10th, జీతం: 6,000 to 10,000 + ఇన్సెంటివ్స్, సెల్: 9133223529, 9666983886. [A-734044]

■ Wanted PRO's to work in Reputed International School in Anantapur. Cell: 9100314499, 9440354441. [A-441]

■ అనంతపురం లోకల్ నందు జాబ్ చేయడానికి Male / Female కావలెను. Sal : 7,000/- to 10,000/-. Contact : 8121661651, అనంతపురము. [A-734046]

■ అగ్రికల్చర్ ఫీల్డ్ ఆఫీసర్ వర్క్ చేయుటకు 10th to డిగ్రీ అర్హతగల వారు కావలెను. జీతం : 14 వేలు + 2,500. సెల్: 9908466458. [A-734045]

■ ప్రముఖ సంస్థ నందు మీ ఇంటి దగ్గర ఉంటూ పార్ట్‌టైం/ఫుల్‌టైం పోస్టల్ కవర్లపై అడ్రస్‌లు వ్రాయుటకు స్త్రీ/పురుషులు కావలెను. నెలకు 10-15వేలు వరకు సంపాదన. ఫ్రీ బుక్‌లెట్ కొరకు 9059509586 [G-781918]

■ ప్రముఖ రిలయన్స్ లైఫ్ ఇన్సూరెన్స్ కం. అనంతపూర్ బ్రాంచ్‌లో (P/F) జాబ్స్ కలవు. Qly : Any డిగ్రీ, Age : 24-50(M/F) Sal : 20-30K (P.M) PF + ఇన్సెంటివ్స్/ ప్రమోషన్స్. సెల్ : 98857 26036 [L-794975]

■ మీ ఇంటి వద్దనే వుండి మీ మొబైల్ ద్వారా మా కంపెనీ యొక్క Message పంపుతూ వారానికి3500/- సంపాదించుకోండి. వాట్సాప్ చేయండి. 9573633520, 9059633520 [M-1190580]

■ ఇంటి దగ్గర ఉండి మా కంపెనీ బల్బులు ఫిటిచేసి ఇవ్వడం ద్వారా నెలకి 15 వేలు ఆపైన జీతం కలదు. మరిన్ని వివరాలకు సంప్ర : 90004 08325 [L-520]

■ హైదరాబాద్‌లోని ఓల్డేజ్ హోం కొరకు రెసి॥ లేడీ కేర్‌టేకర్స్, రెసి॥ వంటవారు (వ. 35-40) & ఆయాలు కావలెను. మంచి జీతం, ఫ్రీ వసతి+భోజనం. ఫోన్ : 9700006699, 7981467036 [H-793518]

■ ప్రముఖ సంస్థ నందు మీ ఇంటి దగ్గర ఉండి, పార్ట్ / ఫుల్ టైమ్ గా వర్క్ చేస్తూ ప్రతి రోజూ రూ. 500 నుండి రూ. 600 వరకు సంపాదించే అవకాశం. డైలీ పేమెంట్స్. సంప్ర: 9985782069. [A-734047]

■ గ్రాడ్యుయేషన్ అయిన, కంప్యూటర్ పరిజ్ఞానం గల యువతులు ప్రముఖ చానల్‌లో ఆఫీస్ అసిస్టెంట్లుగా కావలెను. సంప్రదించండి. సెల్: 9966428888. [A-734038]

■ Wanted Female Front Office Executive with good communication skills to work in International School. 7095399992 / 3. [A-442]

■ ధర్మవరంలో కార్గో ఆఫీస్ నందు జాబ్ చేయటకు మేనేజర్-1 & అసిస్టెంట్ మేనేజర్-1 (పురుషులు మాత్రమే) కావలెను. Q: డిగ్రీ + M.S.ఆఫీస్, M.S.Excel, Tally వచ్చిన వారికి ప్రాధాన్యత. 3 నెలలు ట్రైనింగ్, ట్రైనింగ్‌లో 10 వేలు, ట్రైనింగ్ తర్వాత జీతం: 12 వేలు. లోకల్ వారికి ప్రాధాన్యత. సెల్: 7013370695. [A-734048]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడ మైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

క్లుప్తంగా

వేసవి జాగ్రత్తలు తీసుకోవాలి

ఆత్మకూరు: ప్రస్తుతం వేసవి జాగ్రత్తలు తీసుకోవాలని ఉపాధి ఏపీఓ సుజాత కూలీలకు తెలిపారు. మంగళవారం తలుపూరు గ్రామం వద్ద జరుగుతున్న ఉపాధి హామీ పనులు పరిశీలించారు.

పంపనూరులో పూజలు

ఆత్మకూరు: పంపనూరు సర్పరూప సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి మంగళవారం పంచామృతాభిషేకాలు, ప్రత్యేక పూజలు జరిగాయి. ఆలయంలోని శ్రీ మంజునాథ స్వామి, పార్వతీదేవికి ప్రత్యేక పూజలు నిర్వహించి, మహామంగళహారతి చేశారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు, అన్నదానం చేశారు.

13న హుండీ లెక్కింపు

పంపనూరులోని స్వామి ఆలయంలో ఈ నెల 13న హుండీ కానుకల లెక్కింపు ఉంటుందని ఆలయ ఈఓ అక్కిరెడ్డి తెలిపారు.

బాధ్యతల స్వీకరణ

అనంతపురం సప్తగిరి సర్కిల్: ప్రభుత్వ సర్వజనాస్పత్రి సూపరింటెండెంట్‌గా డాక్టర్ రఘునందన్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. దీర్ఘకాలిక సెలవుపై వెళ్లిన ఆయన సెలవును ముగించుకొని బాధ్యతలు తీసుకున్నారు.

అంకితభావంతో పని చేయాలి

అనంతపురం క్రైం: ప్రతి ఒక్కరూ అంకితభావంతో పని చేసి ప్రజలకు మెరుగైన సేవలందించాలని కమిషనర్ కే భాగ్యలక్ష్మి పిలుపునిచ్చారు. మంగళవారం నగరపాలక సంస్థలోని కమిషనర్ చాంబర్‌లో ఈ ఏడాది నగరపాలక సంస్థ డైరీని కమిషనర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ రమణారెడ్డి, డిప్యూటీ కమిషనర్ సావిత్రి, ఆర్‌ఓలు సతీష్, సుజాత, సూపరింటెండెంట్లు విజయ్‌కుమార్, ఖయ్యూం, సిబ్బంది ఉదయ్‌కుమార్ రెడ్డి, శ్రీకాంత్, శరత్ పెద్దక్క పాల్గొన్నారు.

గ్రేడ్- 3 ఏఎన్ఎంల సమస్యలు పరిష్కరించండి

అనంతపురం సప్తగిరి సర్కిల్: సచివాలయాల పరిధిలోని గ్రేడ్ -3 ఏఎన్ఎంల సమస్యలు పరిష్కరించాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ వీరబ్బాయికి ఎన్జీఓ సంఘం నాయకులు మంగళవారం వినతిపత్రం అందించారు. క్షేత్రస్థాయిలో విధులు నిర్వహించే ఆరోగ్య సిబ్బందికి ఆన్‌డ్యూటీగా నమోదు చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా ఏపీ ఎన్జీఓ అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి, కార్యదర్శి చంద్రమోహన్, నగర అధ్యక్షుడు మనోహర్‌రెడ్డి, అక్కులప్ప, శ్రీనివాసులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పోలీసులపై చర్యలు తీసుకోవాలి

అనంతపురం అర్బన్: శ్రీసత్యసాయి జిల్లా కదిరిలో విలేకరులపై దురుసుగా ప్రవర్తించిన పోలీసులపై చర్యలు తీసుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్ మంగళవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. బాధ్యతగా వ్యవహరించాల్సిన సీఐ ప్రవర్తన శాంతిభద్రతలకు విఘాతం కలిగేందుకు కారణమయ్యిందన్నారు. విలేకరుల సెల్‌ఫోన్లు బలవంతంగా తీసుకోవడమే కాకుండా తిరిగి కేసులు పెట్టడం సరికాదన్నారు. ఘటనపై విచారణ జరిపించాలన్నారు.

35 పాత వాహనాల వేలం

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: జిల్లా పోలీసుశాఖలో వినియోగించిన 35 పాత వాహనాల వేలం ఈనెల 17న వేయనున్నట్లు జిల్లా పోలీసు కార్యాలయం అధికారులు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ మార్గదర్శకాలు, నిబంధనల మేరకు ట్రాక్టర్లు 2, కమాండర్ జీపులు 11, ఐచర్ బస్సులు 6, క్వాలీస్‌లు- 2, టాటా సుమోలు 6, టాటా స్కార్పియో 1, మహీంద్ర మ్యాక్స్ లు 2, ద్విచక్ర వాహనాలు 5 మొత్తం 35 వాహనాలు వేలం వేయనున్నారు. వేలం వేయనున్న వాహనాలను జిల్లా పోలీసు హెడ్ క్వార్టర్స్ లోని మోటారు ట్రాన్స్‌పోర్టు (ఎంటీ) విభాగం ఆవరణలో ప్రదర్శనలో ఉంచనున్నారు. పూర్తి వివరాలకు ఎంటీఓ సెల్: 9440901914లో సంప్రదించొచ్చు.

కుష్టు బాధితులను గుర్తించేందుకు శిక్షణ

అనంతపురం సప్తగిరి సర్కిల్: స్థానిక లెప్రసీ విభాగం కార్యాలయంలో కుష్టు బాధితులను గుర్తించేందుకు ఆశా, ఆరోగ్య కార్యకర్తలకు శిక్షణ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. మెడికల్ ఆఫీసర్ డాక్టర్ అనుపమ జేమ్స్ మాట్లాడుతూ రాష్ట్ర హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ ఆదేశాల మేరకు ఈ నెల 1 నుంచి 21 వరకు కుష్టు వ్యాధిగ్రస్తులను గుర్తించేందుకు సర్వే నిర్వహిస్తున్నామన్నారు.

టౌన్‌బ్యాంకు ఉపాధ్యక్షుడిగా బి.రమణయ్య

అనంతపురం అగ్రికల్చర్: 'ది అనంతపురం అర్బన్ కోఆపరేటివ్ టౌన్‌బ్యాంకు' ఉపాధ్యక్షుడిగా బి.రమణయ్యను ఏకగ్రీవంగా ఎంపిక య్యారు. మంగళవారం స్థానిక బ్యాంకు ప్రధాన కార్యాలయంలో చైర్మన్ జేఎల్ మురళీధర్ అధ్యక్షతన పాలకవర్గం సమావేశం నిర్వహించారు.

దివ్యాంగుల సంక్షేమమే లక్ష్యం

చెన్నేకొత్తపల్లి: దివ్యాంగుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని ఎంఈఓ కృష్ణ మోహన్ తెలిపారు. మంగళవారం స్థానిక మండల కేంద్రంలోని భవిత కార్యాలయంలో దివ్యాగుల ట్రైసైకిల్ ఉపకరణాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో భవిత కేంద్రం ఉపాధ్యాయులు వెంకట లక్ష్మి, నాగరాజు, ఎంఆర్‌సి సిబ్బంది రామసుబ్బారెడ్డి, శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పల్లెలకు పండగ వచ్చిందే !



వరిపొలంలో కొంగలు



వరినాట్లు వేస్తున్న మహిళా కూలీలు



ఈ ఏడాది వర్షాలు సమృద్ధిగా కురిశాయి. కాలువలు, కుంటలు, చెరువులు నిండు కుండలను తలపిస్తున్నాయి. పంట నూర్పిళ్లతో పల్లెలకు ఖరీఫ్ కాంతులు నిండాయి.. రబీ రానే వచ్చింది. మార్చి నెలతో వేసవి మొదలైంది. ఎండలు మండుతున్నాయి. పొలాలన్నీ పచ్చదనం పరుచుకున్నాయి. బోరుబావుల్లో జలజలా నీరుపారుతుంటే.. ఈడుపోయిన బీడు భూముల్లో జీవాలు మేస్తుంటే.. మొక్కజొన్న పంట కోస్తుంటే.. మగువలు పలుగులు పట్టి కలుపు తీస్తుంటే.. పట్టకొచ్చిన పైరుకు రైతన్నలు ఎరువు చల్లుతుంటే.. ఇలా ఎ'వరి' పనుల్లో వారుండగా.. అలా ప్రకృతి రమణీయత సాక్షాత్కారమైంది..

\- సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం





నిండుగా పారుతున్న హెచ్చెల్సీ కెనాల్



బీడు భూమిలో మేత కోసం జీవాల ఆరాటం



కలుపుతీస్తున్న మహిళలు

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు రుణపడి ఉంటాం

అనంతపురం రూరల్: ప్రభుత్వ వసతి గృహాల్లోని వర్కర్లు, అటెండర్లను ఆంధ్రప్రదేశ్ అవుట్ సోర్సింగ్ (ఆప్కాస్) విధానంలోకి తీసుకునేలా కృషి చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటామని సాంఘిక సంక్షేమ శాఖ నాల్గో తరగతి ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు తిప్పయ్య, జిల్లా గౌరవాధ్యక్షులు రవీంద్ర పేర్కొన్నారు. మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరులతో వారు మాట్లాడారు. జిల్లాలో ప్రభుత్వ వసతి గృహాల్లో గత నాలుగేళ్ల నుంచి వర్కర్లు, అటెండర్లుగా 44 మంది విధులు నిర్వర్తిస్తున్నా వారికి జీతాలు అందక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారన్నారు. తమకు న్యాయం చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఎప్పటికీ రుణపడి ఉంటామన్నారు. కార్యక్రమంలో నాల్గో తరగతి ఉద్యోగుల సంఘం నాయకులు టీసీ ముత్యాలు, శేఖర్, మల్లేసు తదితరులు పాల్గొన్నారు.

రూ.31 లక్షల పన్ను వసూలు

అనంతపురం క్రైం: నగరంలోని పలు సచివాలయాల పరిధిలో రూ.31 లక్షల ఇంటి, నీటి పన్ను బకాయి వసూలు చేశారు. మంగళవారం అదనపు కమిషనర్ రమణారెడ్డి, ఆర్‌ఓలు సతీష్, సుజాత, ఆర్‌ఐలు మురళీ, వేణు, బాబు, పద్మావతి, సచివాలయ సిబ్బంది బృందాలుగా ఏర్పడి బకాయి వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారించారు. రాజహంస అపార్ట్‌మెంట్ నిర్వాహకులు రూ.5,90,000 చెల్లించారు. విధి నిర్వహణలో బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తున్న ముగ్గురు సిబ్బందికి అదనపు కమిషనర్ రమణారెడ్డి మెమోలు జారీ చేశారు. మంగళవారం నగరంలోని రాణినగర్ 15వ సచివాలయాన్ని ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. అక్కడ సిబ్బంది గైర్హాజరు, రిజిస్ట్రేషన్ సరిగా చేయని అడ్మిన్ ములకేష్, ఎడ్యుకేషన్ కార్యదర్శి కొండయ్య, అమినిటీ కార్యదర్శి విశ్వనాథ్ రెడ్డిలకు ఆయన మెమోలు జారీ చేశారు. నగరంలో చెత్త నిర్వహణ పక్కాగా జరగాలని కమిషనర్ కే భాగ్యలక్ష్మి సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. మంగళవారం సచివాలయ సిబ్బందితో కమిషనర్ జూమ్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.

సామాజిక తనిఖీ పారదర్శకంగా చేపట్టండి

కనగానపల్లి: జాతీయ ఉపాధిహామీ పనులపై నిర్వహిస్తున్న సామాజిక తనిఖీని పారదర్శకంగా చేపట్టాలని ఎంపీడీఓ లక్ష్మీనారాయణ సామాజిక తనిఖీ బృందానికి సూచించారు. మండలంలో 2021-22 ఆర్థిక సంవత్సరంలో జరిగిన ఉపాధిహామీ పనులపై సామాజిక తనిఖీ చేపట్టేందుకు వచ్చిన సామాజిక బృందం సభ్యులు, ఉపాధిహామీ సిబ్బందితో మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సమన్వయ సమావేశం నిర్వహించారు. సామాజిక తనిఖీలు చేపట్టే పనుల వివరాలు తెలిపే రికార్డులను బృందం సభ్యులకు అందజేశారు. అనంతరం సామాజిక తనిఖీలో అనుసరించే విధానాలపై బృందం సభ్యులకు అధికారులు అవగాహన కల్పించారు. సమావేశంలో ఎస్ఆర్‌పీ లక్ష్మీనారాయణ, ఏపీఓ సుధాకర్, ఈసీ సాయినాథ్, డీఆర్‌పీలు పాల్గొన్నారు.

ఘనంగా మహాకవి ఉమర్ అలీషా జయంతి



మహాకవికి నివాళులర్పిస్తున్న జిల్లా రచయితలు, కవులు

అనంతపురం కల్చరల్: స్థానిక ఎస్సార్ ఎడ్యుకేషనల్ సొసైటీ కార్యాలయంలో సద్గురువు డాక్టర్ ఉమర్ అలీషా జయంతి వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. సీనియర్ రచయిత డాక్టర్ పతికి రమేష్‌నారాయణ, సంస్థ జిల్లా అధ్యక్షుడు రియాజుద్దీన్ అహ్మద్, రాష్ట్రపతి అవార్డు గ్రహీత చింతా వేంకటేశ్వర్లు, రచయితల సంఘం జిల్లా అధ్యక్షులు సాకే శ్రీహరిమూర్తి, డాక్టర్ నగరూరు రసూల్, ఎడ్యుకేషనల్ సొసైటీ చైర్మన్ సుంకర రమేష్ తదితరులు ఆత్మీయ అతిథులుగా హాజరై మాట్లాడారు. సద్గురువుల తైలవర్ణ చిత్రాన్ని చిత్రించిన చింతా వెంకటేశ్వర్లను సత్కరించారు.

ఆధార్ కేంద్రం తనిఖీ

రామగిరి: మండల కేంద్రంలోని ఆధార్ కేంద్రాన్ని ఎంపీడీఓ ఆజాద్ మంగళవారం తనిఖీ చేశారు. ఈ క్రమంలో వివిధ గ్రామాల నుంచి వచ్చిన ప్రజలకు ఇబ్బందులు కలగకుండా త్వరితగతిన వారి పనిని(డేటా ఎంట్రీ)ని పూర్తి చేయాలన్నారు.

వలంటీర్ కుటుంబానికి ఆర్థికసాయం



ఆర్థిక సహాయం అందిస్తున్న సచివాలయ సిబ్బంది, వలంటీర్లు

చెన్నేకొత్తపల్లి: మండలంలోని గంగినేపల్లికి చెందిన వలంటీర్ నాగరాజు గత నెల జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన విషయం విదితమే. ఆ కుటుంబానికి సచివాలయ సిబ్బంది, వలంటీర్లు అండగా నిలిచారు. చేయి చేయి కలిపి రూ.32వేలు నగదు అందించి అండగా నిలిచారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రాము, వీఆర్‌ఓ కదిరప్ప, సిబ్బంది, మురళీధర్ సాయి, రమణ, కళావతి, కృష్ణమ్మ, అపర్ణ, శ్రీరాం నాయక్‌లు పాల్గొన్నారు.

మహిళ ఆత్మహత్య

రాప్తాడు: మండలంలోని ప్రసన్నాయపల్లి రైల్వే స్టేషన్ సమీపంలో నాయక్ నగర్ రైల్వే గేట్ వద్ద రైలు కింద పడి ఓ మహిళ ఆత్మహత్య చేసుకుంది. మృతురాలిని కర్ణాటకలోని తుమకూరు జిల్లా కొడిగేహళ్లి తాలూకా కడగత్తూరుకు చెందిన గంగరత్నమ్మ (50)గా రైల్వే పోలీసులు గుర్తించారు. వ్యవసాయ కూలి పనులతో జీవనం సాగిస్తున్న ఆమె అనంతపురంలోని సర్వజనాస్పత్రితో తన రెండో కుమార్తె భాగ్యమ్మ కాన్పు కావడంతో సాయం కోసం వచ్చింది. ఈ క్రమంలో మంగళవారం మధ్యాహ్నం 2.30 గంటలకు నాయక్ నగర్ రైల్వే గేట్ వద్దకు చేరుకుని గూడ్స్ రైలు కిందపడి ఆత్మహత్య చేసుకుంది. ఆమె మృతికి కారణాలు తెలియాల్సి ఉంది. ఘటనపై ధర్మవరం రైల్వే పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

ఆకట్టుకున్న వైజ్ఞానిక ప్రదర్శన



చిన్నారులు రూపొందించిన నమూనాలను పరిశీలిస్తున్న ముఖ్యఅతిథులు, ఉపాధ్యాయులు





విద్యార్థినులు తయారు చేసిన ప్రాజెక్ట్

రాప్తాడు : సైన్స్ ఆవిష్కరణలతోనే దేశాభివృద్ధి సాధ్యమని రాప్తాడు జెడ్పీహెచ్ఎస్ హెచ్ఎం నరసింహులు తెలిపారు. మంగళవారం రాప్తాడులోని ఉన్నత పాఠశాలలో సైన్సు దినోత్సవాన్ని జరిపారు.

ఆకట్టుకున్న చిన్నారుల నమూనాలు

అనంతపురం సిటీ: అనంతపురం - కళ్యాణదుర్గం రోడ్డులోని పాపంపేటలోని శ్రీ అక్షయ ఇంగ్లిష్ మీడియం స్కూల్‌లో మంగళవారం సైన్స్‌డే నిర్వహించారు. పాఠశాలలో చదివే చిన్నారులు రూపొందించిన నమూనాలను ప్రదర్శించారు. ముఖ్య అతిథులుగా పీపుల్స్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ డీఎస్ మూర్తి, జాతీయ పర్యావరణ పరిరక్షణ సమితి అడ్వైజర్ లెనిన్, కరస్పాండెంట్ సోమశేఖర్, ప్రిన్సిపాల్ విజయలక్ష్మి హాజరయ్యారు.

రాప్తాడురూరల్: సైన్స్ దినోత్సవంలో భాగంగా మంగళవారం అనంతపురం రూరల్ మండలం విద్యారణ్యనగర్‌లోని జోర్డాన్ ఇంగ్లిష్ మీడియం స్కూల్‌లో విద్యార్థులు ఏర్పాటు చేసిన వైజ్ఞానిక ప్రదర్శన ఆకట్టుకుంది. విద్యార్థుల మేథోశక్తిని పెంచేలా ప్రాజెక్టులను తయారు చేసి, ప్రదర్శనలో ఉంచారు. వైఎస్సార్‌సీపీ యూత్ మండల కన్వీనర్ శ్రీనివాసులు, జాకీర్‌కాలనీ, సుందరయ్యకాలనీ, విద్యారణ్యనగర్, దండోరాకాలనీ, పాపంపేట ప్రాంతాల నుంచి విద్యార్థుల తల్లిదండ్రులు వచ్చి ప్రదర్శనలను తిలకించారు. కార్యక్రమంలో స్కూల్ కరస్పాండెంట్ విక్టర్‌బాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విజ్ఞానం.. అద్భుతం

అనంతపురం సిటీ: మనిషిని చీకటిలో నుంచి వెలుగులోకి తీసుకువెళ్లే అద్భుత సాధనం.. సైన్స్ ఒక్కటేనని బాలాజీ విద్యా సంస్థల చైర్మన్లు పల్లె కృష్ణకిశోర్, పల్లె సింధూర అన్నారు. జాతీయ విజ్ఞాన దినోత్సవాన్ని పురస్కరించుకొని అనంతపురంలోని స్ప్రింగ్‌డేల్ ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో మంగళవారం సైన్స్ దినోత్సవం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా కిశోర్, సింధూర హాజరయ్యారు. మానవ జాతిని నిరంతరం చైతన్యవంతులను చేసే అద్భుతమైన సాధనం సైన్స్ మాత్రమేనని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన వివిధ రకాల నమూనాలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఎస్ఆర్ఐ జూనియర్ కళాశాల చైర్మన్ వెన్నపూస విశ్వనాథరెడ్డి, మేనేజింగ్ డైరెక్టర్ చంటిరెడ్డి, కరస్పాండెంట్ కొండారెడ్డి, ప్రిన్సిపాల్ లక్ష్మీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సాంకేతికతతోనే ఉజ్వల భవిష్యత్

అనంతపురం రూరల్: విద్యార్థులు సాంకేతికను అందిపుచ్చుకుంటేనే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని పీవీకేకే పీజీ కళాశాల ప్రిన్సిపాల్ మునికృష్ణారెడ్డి పేర్కొన్నారు. మంగళవారం పీవీకేకే పీజీ కళాశాలలో సైన్స్‌డే నిర్వహించారు. ప్రిన్సిపాల్ మునికష్ణారెడ్డి మారుతున్న కాలానుగుణంగా విద్యార్థులు సాంకేతిక రంగంపై పట్టు సాధిస్తే ఉన్నత శిఖరాలు అవరోదించొచ్చన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ వైసీ పుల్లన్న, డాక్టర్ సంజీవ తదితరులు పాల్గొన్నారు.

మైరెడ్డి నీరజ సేవలు అభినందనీయం



ప్రిన్సిపాల్ మైరెడ్డి నీరజను సన్మానిస్తున్న వైద్యులు

అనంతపురం సప్తగిరి సర్కిల్: అనంతపురం ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మైరెడ్డి నీరజ సేవలు అభినందనీయమని ప్రభుత్వ సర్వజనాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రఘునందన్ తెలిపారు. స్థానిక ప్రభుత్వ మెడికల్ కళాశాలలోని ఆడిటోరియంలో పదవీ విరమణ కార్యక్రమాన్ని ఏపీ ప్రభుత్వ వైద్యుల సంఘం, ప్రభుత్వ వైద్య కళాశాల, ప్రభుత్వ సర్వజనాస్పత్రి, సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి, వైద్యులు, మెడికోలు, సిబ్బంది తదితరులు ఘనంగా సన్మానించారు. ఆయన మాట్లాడుతూ మైరెడ్డి నీరజ నిజాయితీ, నిబద్ధతతో, ఓపికతో కళాశాల అభివృద్ధికి ఎంతో కృషి చేశారన్నారు. అనంతరం ఆమెను సన్మానించారు. కార్యక్రమంలో ఏపీ ప్రభుత్వ వైద్యుల సంఘం అధ్యక్షుడు డాక్టర్ రామస్వామి నాయక్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీదేవి, వైద్యులు సుబ్రహ్మణ్యం, షారోన్ సోనియా, ఆత్మారాం, శ్రీనివాసనాయక్, నీలిమ, శ్రీదేవి, భానుకిరణ్, నవీద్ అహమ్మద్, ఎంద్లూరి ప్రభాకర్, వివిధ విభాగాల హెచ్‌ఓడీలు, వైద్యులు వైఎంఎస్ ప్రసాద్, జగన్‌మోహన్‌రెడ్డి, శ్రీనివాసరావు, భవాని, శ్రీదేవి, పద్మశ్రావణి, విజయకుమారి, శ్రావణి, ఆదిరెడ్డి పరదేశినాయుడు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ మెడికల్ కళాశాల ఎఫ్ఏసీ ప్రిన్సిపాల్‌గా శ్రీదేవి



అనంతపురం సప్తగిరి సర్కిల్: ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ (ఎఫ్ఏసీ)గా డాక్టర్ ఆరేపల్లి శ్రీదేవిని నియమిస్తూ డీఎంఈ (డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్) ఉత్తర్వులు జారీ చేశారు. మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్‌గా వ్యవహరిస్తున్న డాక్టర్ మైరెడ్డి నీరజ మంగళవారం ఉద్యోగవిరమణ చేశారు. డాక్టర్ శ్రీదేవి ప్రస్తుతం అనంతపురం ప్రభుత్వ మెడికల్ కళాశాలలో కమ్యూనిటీ మెడిసిన్ హెచ్‌ఓడీగా, పోస్ట్ గ్రాడ్యుయేషన్ అకడమిక్ వైస్ ప్రిన్సిపాల్‌గా వ్యవహరిస్తున్నారు. ఆమెకు పలువురు శుభాకాంక్షలు తెలిపారు.

సంతమార్కెట్ వేలం వాయిదా

అనంతపురం క్రైం: సంత మార్కెట్ వేలంపాట మరోసారి వాయిదా పడింది. నగరపాలక సంస్థలో కమిషనర్ కే భాగ్యలక్ష్మి, అదనపు కమిషనర్ రమణారెడ్డి సంత మార్కెట్ వేలంపాట మంగళవారం నిర్వహించారు. సంత మార్కెట్‌కు సర్కార్ సవాల్ రూ.80 లక్షలుగా నిర్ధారిస్తూ కమిషనర్ భాగ్యలక్ష్మి వేలం పాట ప్రారంభించారు. వేలంపాటలో పాల్గొన్న ఇద్దరు కాంట్రాక్టర్లు విజయ్‌కుమార్, కుమార్ సర్కార్ సవాల్‌కు ఆసక్తి చూపలేదు. కమిషనర్ వేలం పాడాలని కాంట్రాక్టర్లకు విజ్ఞప్తి చేయగా, అందుకు వారు గిట్టుబాటుకాదని చెప్పారు. సర్కార్ సవాల్‌ను రూ.60 లక్షలు నిర్ధారించాలని కాంట్రాక్టర్లు కమిషనర్‌ను కోరగా, అందుకు ఆమె సర్కార్ సవాల్‌ను రూ.78 లక్షలు నిర్ధారించారు. కానీ వారి నుంచి ఎలాంటి స్పందన రాకపోవడంతో వేలం పాట వచ్చే ఈనెల 4 నాటికి వాయిదా వేస్తున్నట్లు కమిషనర్ పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆర్‌ఓలు సతీష్, సుజాత, ఆర్‌ఐలు వేణు, మురళీ, బాబు, పద్మావతి, సూపరింటెండెంట్ వేణుగోపాల్, తదితరులు పాల్గొన్నారు.

నిస్వార్థ సేవతోనే నిజమైన గుర్తింపు



ఇంజినీర్ వెంకటశేషయ్య దంపతులను సన్మానిస్తున్న జెడ్పీచైర్ పర్సన్ బోయ గిరిజమ్మ తదితరులు

అనంతపురం సిటీ: విధి నిర్వహణలో ప్రభుత్వోద్యోగులు నిబద్ధతతో పని చేసినప్పుడే పది కాలాల పాటు ప్రజల హృదయాల్లో గుర్తుండిపోతాయరని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ అన్నారు. పంచాయతీరాజ్ శాఖ శింగనమల సబ్ డివిజన్‌లోని బుక్కరాయసముద్రం మండల ఇంజినీరింగ్ అధికారిగా పని చేస్తూ స్వచ్ఛంద ఉద్యోగ విరమణ చేసిన వెంకటశేషయ్యను అనంతపురంలోని ఆ శాఖ జిల్లా కార్యాలయంలో మంగళవారం సన్మానసభ ఏర్పాటు చేశారు. పీఆర్ డీఈఈ రాచంరెడ్డి భాస్కర్‌రెడ్డి అధ్యక్షతన ఏర్పాటు చేసిన కార్యక్రమానికి జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, పీఆర్ ఎస్ఈ యమ్మాని భాగ్యరాజ్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. అనంతరం వెంకటసుబ్బయ్య దంపతులను సన్మానించారు. కార్యక్రమంలో ఈఈలు రవీంద్ర, ప్రసాద్, మల్లికార్జునమూర్తి, డీఈ శ్రీనివాసమూర్తి, గురుమూర్తి, ఏఈఈ జింకా కృష్ణజ్యోతి, సిబ్బంది పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఎర్రిస్వామితాత ఉట్ల పరుష



ఉట్లమాను ఎక్కుతున్న యువకులు



ఉట్ల పరుషకు హాజరైన జనం



బహుమతులు అందజేస్తున్న దృశ్యం

రాప్తాడు: అయ్యవారిపల్లిలో కాల్వగొంచి, గ్రామస్తుల ఆధ్వర్యంలో నిర్వహించిన ఎర్రిస్వామి తాత ఉట్లపరుష మంగళవారం ముగిసింది. ఆలయంలో తెల్లవారుజామున ఎర్రిస్వామి తాతకు ప్రత్యేక పూజలు చేశారు. పరుషకు రాప్తాడు, కనగానపల్లి, ఆత్మకూరు, అనంతపురం, ధర్మవరం తదితర మండలాల నుంచే కాక జిల్లాలోనిపలు ప్రాంతాల నుంచి భక్తులు వచ్చారు. ఆలయం సమీపంలో దుకాణాల వద్ద సందడి నెలకొంది. ఆలయంలో వినాయకుడు, శ్రీరాముడు, ఎర్రిస్వామి తాత, గోటుకూరుప్ప స్వాములకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అయ్యవారిపల్లి, బొమ్మేపర్తి, బుక్కచెర్ల, కాట్నేకాలువ గ్రామాల గొల్ల కులస్తులు ఉట్టి కొట్టారు. పరుష జరిగిన మూడు రోజులు గ్రామంలో ఎవరూ పొయ్యి వెలిగించలేదు. ఆలయం వద్ద నిరంతరం అన్నదానం జరిగింది. ఆలయం దగ్గర అనంతపురం రూరల్ మండలంలోని రుద్రంపేటకు చెందిన గౌరం రమాదేవి, గౌరం మోగేంద్ర రెడ్డి దంపతులు అన్నదానం చేశారు. ఎస్ఐ ఆంజనేయులు ఆధ్వర్యంలోబందోబస్తు ఏర్పాటు చేశారు.

పోటీపోటీగా రాతిదూలం లాగుడు పోటీలు

రాప్తాడు: అయ్యవారిపల్లె ఎర్రిస్వామితాత ఉట్ల పరుషను పురస్కరించుకొని కాల్వగొంచి వారి ఆధ్వర్యంలో జిల్లా స్థాయి రాతి దూలం లాగుడు పోటీలు మంగళవారం ఉదయం నిర్వహించారు. జిల్లాలోనే వివిధ ప్రాంతాలకు చెందిన 9 జతల దేశీయ ఎద్దులు (వృషభాలు) పాల్గొన్నాయి. ఒక్కో జతకు 20 నిమిషాల సమయం కేటాయించారు. పోటీల్లో ఎద్దులు పోటా పోటీగా ముందుకు సాగాయి. ఈ పోటీల్లో అనంతపురం రూరల్ మండల సోములదొడ్డికి చెందిన రాజగోపాల్ ఎద్దులు మొదటి స్థానంలో నిలవగా వీరికి రూ.20 వేలు గెలుపొందాయి. గార్లదిన్నెకు చెందిన పరమేష్ వృషభాలు ద్వితీయ బహుమతి రూ.15 వేలు గెలుపొందాయి. ఆత్మకూరు మండలం కుర్లపల్లికి చెందిన తలారి అంకమ్మకు చెందిన వృషభాలు తృతీయ బహుమతి రూ.10 వేలు గెలుపొందాయి. సోములదొడ్డికి చెందిన చెన్నప్ప వృషభాలు నాల్గో బహుమతి రూ.5 వేలు గెలుపొందాయి. ప్రథమ బహుమతి అయ్యవారి పల్లెకు చెందిన బొంతపుల్లారెడ్డి , ద్వితీయ బహుమతి పరమేషప్ప, తృతీయ బహుమతి జోగి చిన్న ఎర్రిస్వామి , నాల్గో బహుమతి కామకొండ వీరాంజనేయులు అందజేశారు.





